క్లుప్తంగా

పన్ను బకాయిదారులపై అధికారుల కొరడా



భూపాలపల్లి: ఆస్తి పన్ను బకాయిదారులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. వందశాతం వసూలు చేసేందుకు గాను పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలపై దృష్టి సారించారు. ఈ మేరకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ఇంటింటికీ వెళ్లి పన్నులను వసూలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి ఆస్తులను జప్తు చేస్తున్నారు. 14వ వార్డు జంగేడుకు చెందిన ఓ వ్యక్తి రూ. 7,800 పన్ను బకాయి ఉండగా బుధవారం అతడి ఇంటి తలుపులు జప్తు చేసుకొని నల్లా కనెక్షన్‌ను తొలగించారు. అయితే చిన్న మొత్తంలో బకాయి ఉన్న వారిపై కొరడా ఝులిపించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ. లక్షల్లో బకాయి ఉన్న వారిని వదిలేసి రూ.వేలల్లో బకాయి ఉన్న వారి ఆస్తులు జప్తు చేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సన్మానం



మల్హర్: మండలంలోని దామెరకుంట గ్రామానికి చెందిన జాతీయ సేవారత్న అవార్డు గ్రహీత ఆత్మకూరి స్వామియాదవ్‌ను మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో యాదవ బీసీ ముద్దబిడ్డకు నేషనల్ సేవరత్నా అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య, బీసీ సంఘం నాయకుడు మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు సమ్మయ్య, బీసీ సంఘం సీనియర్ నాయకులు యాందడ్ల రామన్న, కొడాలి చిన్నమల్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మహాముత్తారం: మండలంలోని గాజారాంపల్లి గ్రామానికి చెందిన ఒల్లాల సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, కాంగ్రెస్ నాయకులు తూటి భాస్కర్‌రెడ్డి, సుగుణకర్ రావు, ఠాకుర్ రవి, రంగు రవి, నవరాం నాయక్, వెన్నపురెడ్డి సాంబశివరెడ్డి ఉన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

కాటారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నేడు(గురువారం) కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్డీఓను కలిసిన నాయకులు



భూపాలపల్లి రూరల్: నూతనంగా భూపాలపల్లి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన మంగిలాల్‌ను జిల్లా సేవాలాల్ సేనా అధ్యక్షుడు భూక్య సురేష్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేనా నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేనా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాలునాయక్, నాయకులు రఘురాం, రూప్‌సింగ్, నవీన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి, మహాముత్తారం, కోనంపేట వెళ్లే ప్రధాన రహదారుల్లో మహాముత్తారం పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ మాషుక్, సిఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

11న అప్రెంటీస్ మేళా

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 11న ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రంటీస్(పీఎంఎన్ఎం) మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాకు ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని ఆసక్తి గల వారు www.apprentic-erhipmea వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకున్నవారు సర్టిఫికెట్స్‌తో పాటు పాస్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

పాఠశాలల్లో మాక్ పోలింగ్



చిట్యాల: మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు



కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేటలో..

చిట్యాల: మండలంలోని నైన్‌పాక ఉన్నత పాఠశాలలో బుధవారం నమూనా(మాక్) పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊర్మిళ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. పాఠశాల లీడర్ కోసం నిర్వహించిన ఎన్నికల్లో 119 విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు నమూనా ఎన్నికల్లో పాల్గొన్న తీరును చూసి ఎంపీటీసీ రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, శ్యాంసుందర్, సుధాకర్, ప్రణీత, స్వాతి, రాజశేఖర్, రమేష్ లింగయ్య, సతీష్, శ్రీధర్, ఓదేలు, సీఆర్పీ తిరుపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కోటిలింగం, కల్పనాకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులతో నమునా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు అవినాష్, చందు, మణిదీప్, నవ్యశ్రీ పోటి చేశారు. వీరికి ఎన్నికలు నిర్వహించగా విద్యార్థి నాయకుడిగా అవినాష్ విజయం సాధించాడు. పోలింగ్ ఆఫీసర్స్‌గా హైమత్, మనోజ్, నందిని, శ్రీవరుణ్ బీఎల్ఓగా కీర్తన, మరికొందరు విద్యార్థులు పోలింగ్ ఏజెంట్‌గా, కౌంటింగ్ ఏజెంట్‌గా ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కృష్ణ, రాజేందర్, చక్రధర్, కుమారస్వామి, శ్రీధర్, దామోదర్, శిరీష, రజిత, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడి పొందాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాటారం: ప్రభుత్వం అమల్లోకి తీసుకొస్తున్న వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతులు సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలు, సలహాలు పాటించి అధిక పంట దిగుబడి పొందవచ్చని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆధునిక వ్యవసాయ సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించగా మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం లైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాంకేతికను అందిపుచ్చుకొని మరింత బలోపేతం అవాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మహాముత్తారం జెడ్పీటీసీ లింగమల్ల శారద మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. వచ్చే పంటకాలం నుంచి పంటల భీమా పథకం అమలు చేయడంతో పాటు రైతులకు సాగులో శాస్త్రవేత్తల ద్వారా సూచనలు సలహాలు అందించడం కోసం అన్ని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, తహసీల్దార్ నాగరాజు, ఏడీఏ శ్రీనివాసరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీటీసీలు జాడి మహేశ్వరీ, ఉడుముల విజయరెడ్డి, ఏఓ గిరి రామకృష్ణ, వ్యవసాయశాఖ అధికారులు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడిగా రాజు



చిట్యాల: యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అల్లం రాజు నియమించినట్లు మండల యూత్ అధ్యక్షుడు కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా బుర్ర రాజ్‌కుమార్, పుల్ల శ్రీకాంత్, బైరం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శనిగరపు మహేష్, కోశాధికారిగా అరెపల్లి రమణ, సహాయ కార్యదర్శిగా కట్కూరి సుమన్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనాథ్, సాగర్, రాజ్‌కుమార్, నవీన్‌లను ఎన్నుకున్నట్లు కుమార్ తెలిపారు.

చిట్యాల సీఐగా మల్లేష్ యాదవ్



సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సైలు

చిట్యాల: చిట్యాల సీఐగా దగ్గు మల్లేష్ యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ దాసారపు వేణుచందర్ బదిలీపై ఐజీ కార్యాలయానికి వెళ్లగా మల్లేష్ యాదవ్ శాయంపేట నుంచి వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మల్లేష్ యాదవ్‌కు చిట్యాల, టేకుమట్ల, మొగుళపల్లి, రేగొండ, గణపురం ఎస్సైలు జంగిలి రమేష్, సుధాకర్, మాధవ్, రవి, సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

సీసీఎస్ సీఐగా రవీందర్



గణపురం: సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ సీఐగా గద్ద రవీందర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గణపురం మండల కేంద్రంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన పులి వెంకట్ హుజూరాబాద్ రూరల్ సీఐగా బదిలీ పై వెళ్లగా భద్రాద్రి కొత్తగూడెం అశ్వపురం నుంచి రవీదర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి అసాంఘిక, అక్రమ కార్యక్రమాలు జరిగిన తమ దృష్టికి తీసుకరావాలన్నారు. మహిళపై గౌరవంగా ఉండాలని చిన్న పిల్లల అక్రమ రవాణ జరిగిన, బాల్య వివాహాలు చేసిన తమ ఎహెచ్‌టీయూ యూనిట్‌కి సంప్రందిచాలని 87126 58108 ఫోన్ నంబర్‌కి సమాచారం అందించాలన్నారు.

సేవాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపాలన సేవా కేంద్రంలో ఎంపీపీ దావు వినోద

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన సేవాకేంద్రాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దావు వినోదవీరారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న వారు గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల లోపు వాడుకున్నప్పటికీ జోరో బిల్లు రాని వారు, అలాగే మహాలక్ష్మీ పథకంలో భాగంగా గ్యాస్ సబ్సిడీ పడనివారు, ఇంత వరకు ప్రజా పాలనలో దరఖాస్తులు చేయని వారు ఈ సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ ఎండీ హుస్సేన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులుగా ఎస్.చందన, ఉపాధ్యాయులుగా ప్రత్యూష, రసజ్ఞ, హన్సిక, సిద్ధాంత కుమార్, తన్విత్, సంధ్య, త్రిలోక్, శ్రీహర్షిత్ వ్యహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పంచిక భగవాన్‌రెడ్డి, ఎ.శ్రీలత, ఎం. నీలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

దారి తప్పిన వృద్ధుడికి పోలీసుల చేయూత



వృద్ధుడితో పోలీసులు

చిట్యాల: అటవీ ప్రాంతంలో ఓ వృద్ధుడు అయోమయంలో ఎండలో నడుచుకుంటూ దారి తప్పడంతో పోలీసులు చేయూతనందిచిన ఘటన మండలంలోని వెంచరామి శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన బుర్ర కర్ణాకర్(65) అనే వృద్ధుడు వృత్తిరీత్యా శివసత్తులు ధరించే గజ్జెల దుస్తులను అమ్ముతూ జీవనం కొనసాగిస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం చిట్యాల మండలంలోని అందుకుతండా గ్రామం నుంచి వెంచరామి మీదుగా తాడిచెర్లకు బయలుదేరాడు. వేసవికాలం కావడంతో ఎండ దెబ్బకు గురై చెట్టు దగ్గర ఉండి దారి తెలియక పోవడంతో అక్కడే తిరుగుతూ ఉన్నాడు. సాయంత్రం అయిన దారి తెలిక పోవడంతో హైదరాబాద్‌లో ఉంటున్న అతడి కుమారుడు బుర్ర శివకు ఫోన్ చేసి జరిగిన సంఘటనను వివరించినట్లు తెలిపారు. దీంతో శివ డయల్ కాల్ 100కు ఫోన్ చేయడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్సై జంగిలి రమేష్ తన కానిస్టేబుళ్లు నవీన్, లింగయ్యలను సంఘటన స్థలానికి పంపించాడు. ఈ మేరకు పోలీస్ సిబ్బంది, స్థానికుడు రాజుతో కలిసి నాలుగు గంటలు శ్రమపడి వృద్ధుడి అచూకి కనుగోన్నారు. వృద్ధుడిని తీసుకుని అతడి బంధువులకు సమాచారం ఇచ్చి అప్పగించారు.

ఎండిపోతున్న మొక్కలు



నర్సరీలో ఎండిపోయిన మొక్కలు

రేగొండ: హరితహారంలో భాగంగా మండలంలోని కొడవటంచ గ్రామంలో నర్సరీల ద్వారా మొక్కలు పెంచుతుండగా అవి ఎండలకు వాడిపోయి చనిపోతున్నాయి. ఎండ తీవ్రత దృష్ట్యా మొక్కలు చనిపోకుండా కనీసం షెడ్ నెట్ కూడా ఏర్పాటుచేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి మొక్కలను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

కాటారం: మండలంలోని గంగారం క్రాస్ వద్ద గల తెలంగాణ వైన్స్‌షాపులోని పర్మిట్‌రూంలో జరిగిన గొడవ సంఘటనలో దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొండంపేట గ్రామానికి చెందిన కోలకాని సమ్మయ్య, కొత్తపల్లి రాజేశ్, శత్రాజ్‌పల్లికి చెందిన ముంజం కరుణాకర్, కాపిరానికి చెందిన శీలం మనోజ్, గోస్కుల సందీప్ మంగళవారం వైన్స్‌షాప్‌లోని పర్మిట్‌రూంలో మద్యం తాగారు. ఈ క్రమంలో తినుబండారాల కోసం వెళ్తున్న సందీప్‌కు శంకరాంపల్లికి చెందిన భీమరాజు భుజం తగిలించగా ప్రశ్నించడంతో గొడవ ప్రారంభమైంది. భీమరాజుతో పాటు టేకు సంతోష్, జాడి బాలరాజు అనే ముగ్గురు సందీప్‌తో పాటు వచ్చిన సమ్మయ్య, రాజేశ్, కరుణాకర్, మనోజ్‌లతో వాగ్వివాదానికి దిగడంతో గొడవ పెద్దది అయింది. భీమరాజు వర్గం వారు బయటకు వెళ్లి మరో ముగ్గురిని వెంట తీసుకొని వచ్చి అక్కడే ఉన్న బీరుసీసాలను పగలగొట్టి సమ్మయ్య వర్గంపై దాడికి పాల్పడ్డారు. బీరు సీసాలతో సమ్మయ్య, కరుణాకర్‌లను విచక్షణ రహితంగా పొడవడంతో వారు తీవ్ర గాయాలపాలయ్యారు. సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం విచారణ చేపట్టి దాడికి పాల్పడిన జంగ భీమరాజు, టేకు సంతోష్, జాడి బాలరాజును అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ కార్యాలయంలో 'నారీ శక్తి వందన్'



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

భూపాలపల్లి రూరల్: బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వేశాల సత్యవతి అధ్యక్షతన నారీ శక్తి వందన్ కార్యక్రమం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా వర్చువల్‌గా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మహిళల సంక్షేమ పథకాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రధానిప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమానికి పార్టీ అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి



బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

మహదేవపూర్: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ విలువలతో కూడిన వ్యవస్థను నిర్మితం చేసుకోవాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో సంస్కృతి సమరంభం (కాలేజీ ఫెస్ట్) ను కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా సోదరభావంతో మెలగాలన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుంటూ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలన్నారు. లక్ష్యాలను సాధించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఎస్పీ, ఎస్సైలను అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, కళాశాల కల్చరల్, స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ రాజు, అధ్యాపకులు శ్రీనివాస్, రమేష్, రాజేందర్, మున్నయ్య, పరశురాములు, మహేష్, రజిత, మధురి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కుమారస్వామి

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో మహిళా దినోత్స కరపత్రాన్ని డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ కుమారస్వామి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆదేశాల మేరకు కరపత్రాలు ఆవిష్కరించినట్లు తెలిపారు. అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవ స్ఫూర్తితో నేడు (గురువారం) డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిట్యాలలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ స్కూల్‌లో జరిగే మహిళ సదస్సులో అధిక సంఖ్యలో మహిళ టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు విజయ్‌భాస్కర్, జగన్ నాయక్, మహేష్, స్వర్ణలత, సరిత, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు అన్ని గ్రామాల్లో చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: ఉపాధిహామీ పనులు మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని, కనీసం 100 మంది కూలీలకు తగ్గకుండా కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, పంచాయతీ సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం..



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య

కాటారం: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇరికిల్ల రాజనర్సయ్య, జిల్లా అడ్వైజర్ నరేశ్ అన్నారు. బీఎస్పీ మంథని నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేశ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తో పొత్తు మంచి నిర్ణయం అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆలోచనా విధానానికి పూర్తి స్థాయిలో కట్టుబడి పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా కోకన్వీనర్ కాంపల్లి వనిత, కోశాధికారి కందుగుల రాజన్న, పలు మండలాల అధ్యక్షులు రేనికుంట్ల మల్లేశ్, రామగిరి రాజు, మహమ్మద్ అహ్మద్, నాయకులు అమీన్, వినోద్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో నల్లవాగు వంతెన



ప్రమాదకరంగా ఉన్న వంతెన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం–పలుగుల ఆర్అండ్‌బీ రహదారి మార్గమధ్యలోని నల్లవాగుపై వంతెన నిర్మాణం శిథిలావస్థకు చేరింది. భారీ వాహనాలు తరలివెళ్లడంతో వంతెన పూర్తిగా పగుళ్లు తేలి ప్రమాదకరంగా ఉంది. ప్రమాదం జరుగముందే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

గుడుంబా స్వాధీనం



గుడుంబా, వ్యక్తులను చూపిస్తున్న అధికారులు

కాటారం: మండలంలోని గంగారం, మహాముత్తారం మండలం కొర్లకుంటలో గుడుంబా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రూట్ వాచ్‌లో భాగంగా గంగారం వద్ద ఓ ద్విచక్రవాహనాన్ని, కొర్లకుంట వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని అనుమానం వచ్చి పట్టుకోగా గుడుంబా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. వేర్వేగా ఇద్దరు వ్యక్తుల నుంచి 20 లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అంతకముందు కాటారం, మహాముత్తారం మండలాల్లో గుడుంబా, మద్యం విక్రయిస్తున్న ఆరుగురిని ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో కాటారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గుడుంబా తయారీ, సరఫరా, బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.